ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
గురువారం 4 జూలై 2024





జనగామ జిల్లా పరిషత్ కార్యాలయం

'పరిషత్'ల్లో ఇక ప్రత్యేక పాలన!

- నిన్నటితో ఎంపీటీసీ, నేటితో జడ్పీటీసీ పదవీకాలం ముగింపు
- ప్రత్యేక అధికారుల నియామకం
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత
- బీసీ కులగణన తర్వాతే నిర్వహణ?

జనగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలనకు రంగం సిద్ధమైంది. మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో 'ప్రత్యేక' పాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. పరిషత్తుల్లో ఇకపై పాలన బాధ్యతలను జిల్లా అధికారులకు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం జీవో జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు అధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ప్రజల ఓట్లతో ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా ఎన్నికై ఐదేళ్ల పాటు సేవలు అందించిన సభ్యులు ఇక నుంచి 'మాజీ'లు కాబోతున్నారు. ఎంపీటీసీ, ఎంపీపీల పదవీకాలం బుధవారంతో ముగియగా, జడ్పీటీసీ పదవీకాలం గురువారంతో పూర్తి కానుంది. జిల్లావ్యాప్తంగా 12 మండలాల పరిధిలో 281 గ్రామపంచాయతీలు ఉండగా, 128 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 12 మండలాలకు గానూ 12 మంది ఎంపీపీలు, 12 మంది జడ్పీటీసీలు ఉన్నారు. వీరంతా ఇకపై 'మాజీ'లుగా మిగిలిపోనున్నారు.

ఇక 'ప్రత్యేక' పాలన

మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో పరిషత్‌ల పాలనావ్యవస్థ అంతా అధికారుల చేతుల్లోకి వెళ్లనంది. ఐదేళ్ల పాటు సేవలు అందించిన సభ్యులంతా ఇక మాజీ సభ్యులుగా మిగిలిపోనున్నారు. పాలనా వ్యవహారాల్లో ఇకపై వారి జోక్యం ఉండబోదు. మండల, జిల్లా పరిషత్‌లకు వచ్చే నిధులు ఖర్చు, ఇతర పాలనాపరమైన అంశాలను మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు కేటాయించిన అధికారులే పర్యవేక్షిస్తారు. ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో జిల్లా పరిషత్ కార్యాలయం ప్రత్యేక అధికారుల కేటాయింపుపై దృష్టి పెట్టింది. మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారి ప్రత్యేక అధికారిగా నియమించనుండగా జిల్లా పరిషత్‌కు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు. దీనిపై సంబంధించిన కసరత్తు పూర్తయింది. జనవరి నెలలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో జిల్లా స్థాయి అధికారులు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ఇదే క్రమంలో పరిషత్తుల బాధ్యతలు సైతం వారికే అప్పగించారు.

'పొడగింపు'పై ఆశలు గల్లంతు

తమ పదవీకాలాన్ని మరికొంత కాలం పొడగిస్తారని భావించిన ఎంపీటీసీ, జడ్పీటీసీల ఆశలను ప్రభుత్వం అడియాశలు చేసింది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో తమ పదవీకాలాన్ని పెంచుతారని సభ్యులు భావించారు. కానీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి పొడగింపు ఇవ్వకుండా 'ప్రత్యేక' పాలనకే మొగ్గుచూపింది. పదవీకాలాన్ని పెంచాలంటూ రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా పరిషత్ సభ్యుల నుంచి ప్రభుత్వానికి వినతులు సైతం వెళ్లాయి. ఇప్పట్లో ఎన్నికలు లేనందున తమను మరికొంత కాలం కొనసాగించాలంటూ విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందాయి. కానీ ప్రభుత్వం వాటిని లెక్కలోకి తీసుకోలేదు. జనవరి నెలలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. సర్పంచులకు పొడగింపు ఇవ్వకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీలకు పొడగింపు ఇస్తే వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే..

ప్రత్యేక అధికారులను నియమించడంతో మండల, జిల్లా పరిషత్తులతో పాటు సర్పంచు స్థానాలకు సైతం ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కనిపించడం లేదు. సర్పంచుల పదవీకాలం జనవరి నెలలో ముగియగా ఆ లోపే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ.. రాష్ట్రంలో అప్పుడే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో సమయం లేకపోవడంతో ఆ దిశగా ప్రభుత్వం అడుగు వేయలేదు. ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించాలని భావించగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇదే క్రమంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం దగ్గరపడినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఎన్నికలకు వెళ్లలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కావడం, రాజకీయంగా కొంత అస్థిరత ఉన్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని అధికార కాంగ్రెస్ భావించింది. దీనితో పాటు రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల మార్పు, బీసీ కుల గణన వంటి అంశాలు ఎన్నికలను వాయిదా వేయడానికి కారణంగా మారాయి. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో పదేళ్లకు ఒకే రిజర్వేషన్లను తీసుకువచ్చింది. దీంతో ఈసారి ఎన్నికలు జరిగితే గతంలో ఉన్న రిజర్వేషన్లతోనే జరగాల్సి ఉంటుంది. కానీ.. 2018లో తీసుకువచ్చిన రిజర్వేషన్ల వల్ల తమకు అన్యాయం జరిగిందని బీసీ కుల సంఘాలు చెబుతూ వస్తున్నాయి. బీసీ కులగణను పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతూ వస్తున్నాయి. బీసీ కులగణన చేపడితే ఎస్సీ, ఎస్టీలకు సైతం రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందని అంటున్నారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. బీసీ కులగణనను ఇప్పటికిప్పుడు మొదలు పెట్టినా రాష్ట్రవ్యాప్తంగా పూర్తికావడానికి రెండు, మూడు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అక్టోబరులో ఎన్నికల జరపడానికి అవకాశం ఉంది. కానీ.. వచ్చే ఏడాది జనవరిలో మునిసిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా ముగియనుంది.

దీనికి తోడు ప్రస్తుతం నియమించిన ప్రత్యేక అధికారుల పదవీకాలం 6 నెలల వరకు ఉంటుంది. దీంతో వచ్చే జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

మండల పరిషత్ ప్రత్యేకాధికారులు వీరే..

మండలం	ప్రత్యేక అధికారి	హోదా
జనగామ	బి.నరేంద్ర	జిల్లా మార్కెటింగ్ అధికారి
బచ్చన్నపేట	వినోద్‌కుమార్	జిల్లా వ్యవసాయ శాఖ అధికారి
నర్మెట్ట	ఎస్.శ్రీనివాస్	జిల్లా ఇంటర్మీడియట్ అధికారి
తరిగొప్పుల	బి.వెంకట్‌రెడ్డి	జిల్లా యువజన, క్రీడల అధికారి
స్టేషన్‌ఘన్‌పూర్	ఎల్.శ్రీనివాస్	జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి
లింగాలఘనపురం	కేఆర్ లత	జిల్లా ఉద్యానవన శాఖ అధికారి
రఘునాథపల్లి	వై.రాజేందర్‌రెడ్డి	జిల్లా సహకార శాఖ అధికారి
చిల్పూరు	జి.విజయ్‌కుమార్	ఏడీ, మైనింగ్
జఫర్‌ఘడ్	ఎస్ ఎల్ మనోహర్	జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి
పాలకుర్తి	మొగులప్ప	డీఆర్‌డీవో
కొడకండ్ల	చౌడేశ్వరి	జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి
దేవరుప్పుల	కె.రాము	జిల్లా విద్యాశాఖ అధికారి.

విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలి

అంగన్‌వాడీల్లో చిన్నారులకు పోషకాహారం విధిగా అందించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా



అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారి బరువును పరిశీలిస్తున్న కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 3: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నందున విద్యార్థులకు పాఠ్యాంశాలపైన, సబ్జెక్టుల వారీగా ఓరియంటేషన్ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిలో విద్యా అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్-8ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల సంఖ్యను, గైర్హాజరయిన వారి వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల బరువును, ఎత్తును నేరుగా పరిశీలించారు. చిన్నారులు వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉండడం లేదని వారికి అందించాల్సిన పోషకాహారం విధిగా అందించాలని సూచించారు. అనంతరం సెంటర్‌లోని కోడిగుడ్లను తూకం వేయించి బరువు పరిశీలించారు. నిబంధనల ప్రకారం కోడిగుడ్ల బరువు లేదని సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం సెంటర్ 9 కి వెళ్లి పరిశీలించారు. ఎక్కువ మంది చిన్నారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. సెంటర్‌కు రాని చిన్నారుల తల్లిదండ్రులకు నేరుగా కలెక్టర్ ఫోన్ చేసి పిల్లలు సెంటర్‌కు ఎందుకు రాలేదని తెలుసుకొని సెంటర్‌కు విధిగా చిన్నారులను పంపించాలని సూచించారు. ఇక్కడ చిన్నారుల పెరుగుదలకు కావాల్సిన పోషకాహారం లభిస్తుందని వివరించారు. చిన్నారులు సెంటర్‌కు రాకుంటే వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రప్పించుకోవాలని టీచర్‌కు సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాలలో పదోతరగతి క్లాస్‌రూమ్‌కు వెళ్లారు. క్లాస్‌లో హిందీ పాఠం జరుగుతుండడంతో పుస్తకాన్ని తీసుకొని బాయ్స్‌లో ఎవరైనా హిందీ పద్యం చదువాలని కోరగా ఎవరూ చదవలేదు.బాలికలను చదువమని కోరగా విద్యార్థిని లేచి తడపడుతూ చదివింది. అనంతరం పదో తరగతి మరో సెక్షన్‌కు వెళ్లి విద్యార్థుల సంఖ్యను అడుగగా 20 మంది గైర్హాజరయ్యారని తెలవడంతో అసహనం వ్యక్తం చేశారు. వివిధ సబ్జెక్టుల గూర్చి విద్యార్థులను అడుగగా ఎవరు సరైన సమాధానం చెప్పలేదు. 10 జీపీఏ ఎంత మంది సాధిస్తారని అడుగగా బాయ్స్ ఎవరు స్పందించలేదు. బాలికలు మాత్రం కొందరు చేయి లేపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. పట్టణ కేంద్రంలోని అన్ని సౌకర్యాలు ఉన్న స్కూల్‌లో మంచి మెరిట్ రావాలని, పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలని, ప్రతీ టీచర్ ఐదుగురు విద్యార్థులకు ఇన్‌చార్జిగా ఉండి ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, డీటీ విజయ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ కొమురయ్య, హెచ్ఎం సంపత్, ఆర్‌పిలు అర్జున్, రవీందర్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి..

అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు



పట్టుబడిన పీడీఎస్ నూకల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

జనగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన జనగామ జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం సాయంత్రం జరిగింది. సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మార్కెట్ ఏరియాకు చెందిన అనంతుల నారాయణ పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించే ప్రయత్నం చేశాడు. ఫౌల్ట్రీ ఫారాల పేరుతో మడికొండకు చెందిన శ్రీ విఘ్నేశ్వర, హరిహర మిల్లుల నుంచి 96 బస్తాల నూకలను కొనుగోలు చేశారు. వాటితో పాటు జనగామ మార్కెట్‌లో అప్పటికే నూకలుగా మార్చిన 120 బస్తాలతో పాటు మరో 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని లారీలో లోడ్ చేశారు. సమాచారం అందుకున్న సివిల్ సప్లై అధికారులు మార్కెట్‌కు చేరుకొని పరిశీలించగా పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. దీంతో లారీని సీజ్ చేసి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు డీటీ శ్రీ నివాస్ తెలిపారు. కాగా.. జనగామ కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ సివిల్ సప్లై అధికారుల తనిఖీలు మాత్రం నామ మాత్రంగానే ఉంటున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

నేడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

హాజరు కానున్న మంత్రి కోమటిరెడ్డి

జనగామ రూరల్, జూలై 3: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గురువారం జనగామలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దే మల్లేషం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య వెట్టిచాకిరీ విముక్తి కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. జూలై 4న జిల్లా కేంద్రం లోని జీడికల్ కమాన్ వద్ద ఉదయం 11 గంటలకు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణను కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేషం, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

నలుగురికి షోకాజ్ నోటీసులు

'ప్రజావాణి'లో ఫోన్లు చూడడంపై కలెక్టర్ సీరియస్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జనగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సీరియస్ అయ్యారు. సోమవారం జరిగిన ప్రజావాణి సందర్భంగా ఫోన్లలో నిమగ్నమైన అధికారులకు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజావాణి జరుగుతున్న సమయంలో పలువురు అధికారులు ఫేస్‌బుక్‌లో పోస్టులు, యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ కాలక్షేపం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 2న 'సమస్యలతో ప్రజలు..సెల్‌ఫోన్లలో అధికారులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిస్తూ నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

జనగామ కల్చరల్, జూలై 3: జిల్లా ప్రజా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించబడుతుందని, ఎమ్మెల్సీ బండా ప్రకాష్ తదితరులు అతిథులుగా హాజరవుతారన్నారు. అనంతరం జెడ్పీ సభ్యుల పదవీ విరమణ సభ, సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

లోపభూయిష్టంగా జడ్పీ, మండల వ్యవస్థ

- పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు అవసరం
- మూడంచెల వ్యవస్థ అభివృద్ధికి మేలు
- ఈ అంశం సీఎం రేవంత్ దృష్టికి తీసుకువెళతా
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జఫర్‌గడ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, జూలై 3 : జిల్లా పరిషత్, మండల వ్యవస్థ కొంత లోపభూయిష్టంగా ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలో బుధవారం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. అదేవిధంగా మండల పరిషత్ సభ్యుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కేంద్రంలో పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన సందర్భంలో అయిదంచెల పీఆర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఇందులో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ. జడ్పీటీసీ, జడ్పీచైర్మన్ పదవులు గల ఈ ఐదంచెల వ్యవస్థ వాస్తవానికి మంచిది కాదన్నారు. గతంలో సర్పంచ్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ మాత్రమే ఉండేవారని, ఈ మూడం చెల వ్యవస్థ ద్వారానే ప్రజా ప్రతినిధులకు స్వేచ్ఛ, ప్రజాసేవకు అవకాశం ఉంటుందన్నారు. ఐదంచెల పీఆర్ వ్యవస్థలోని లోపాలను తాను ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువస్తానన్నారు. ఐదంచెలకు బదులుగా.. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చేలా చట్టంలో మార్పుల కోసం సవరణలు చేయాలని.. అసెంబ్లీలో ప్రభుత్వ పరంగా తీర్మానం చేయించి కేంద్రానికి పంపేలా తాను కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ ఎస్ ప్రభుత్వం సుమారు రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిందని, వాటికి నెలకు రూ.10 వేల కోట్ల వరకు వాయిదాలు, వడ్డీలను ప్రస్తుత ప్రభు త్వం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఆదాయానికి మించి అప్పులు చేయడం వల్ల నేడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలిపారు. రైతుల రుణమాఫీని రూ.2 లక్షలు ఒకేసారి చేయడానికి రూ.30 వేల కోట్లు, రైతు భరోసా అమలుకు సుమారు రూ.10 వేల కోట్లు అవసరమవుతున్నాని చెప్పారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రైతులు తీసుకున్న రూ.2 లక్షల లోపు పంట రుణాలను ఆగస్టు 15 లోపు ఒకేసారి మాఫీ చేస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. ఇది రైతులందరికీ ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

జనగామ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

జనగామ రూరల్, జూలై 2: జనగామ పోలీస్‌స్టేషన్ ను డీసీపీ రాజమహేంద్ర నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పాత నేరస్తులను పిలిపించి సత్ప్రవర్తనతో ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. లేని పక్షంలో చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్‌ఐలు భరత్, తిరుపతి, కానిస్టేబుళ్లు రాము, కమలాకర్ పాల్గొన్నారు.



పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ రాజమహేంద్ర

డీఐఈవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐఈవో శ్రీనివాస్

జనగామ కల్చరల్, జూలై 3: జనగామ డీఐఈవోగా శాగంటి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొడకండ్ల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌ను డీఐఈవోగా నియమిస్తూ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేయగా ఆయన రిజిస్టరులో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఐఈవో కె.అంజనేయరాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలపై.. రంగులు వేశారు..



లింగాలఘణపురం మండలం బండ్లగూడెం రైతువేదికలో మాజీ సీఎం చిత్రం కనపడకుండా రంగు వేసిన దృశ్యం

లింగాలఘణపురం మండలం బండ్లగూడెం రైతువేదికలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రాలు వేసిన అధికారులు తాజాగా ఆ చిత్రాలు కనబడకుండా రంగులు వేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం, మంత్రులు మారారు. కాగా అధికారులు గతంలో వేసిన చిత్రాలు కనబడకుం డా రంగులు వేయడం గమనార్హం.

- లింగాలఘణపురం.

విజ్ఞాన భాండాగారం.. 'ఆస్కార్' గ్రంథాలయం

- స్వగ్రామం చల్లగరిగలో నిర్మించిన సినీ గేయ రచయిత చంద్రబోస్
- నేడు ప్రారంభోత్సవం.. హాజరవనున్న పలురంగాల ప్రముఖులు

చిట్యాల, జూలై 3: పుట్టిన ఊరిపై మమకారం తో.. గ్రామస్థులకు ఇచ్చిన మాటకు కట్టుబడి.. తాను సాహితీ ఓనమాలు నేర్చుకున్న చోట అధునాతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత కనుకంట్ల చంద్రబోస్. తన తల్లి కనుకుంట్ల మధునమ్మ జ్ఞాపకార్థం రూ. 36 లక్షలతో స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో హంగులతో నిర్మించిన ఆ గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. చంద్రబోస్ పాఠశాల విద్యనభ్యసించే సమయంలో నిత్యం ఇక్కడి గ్రంథాలయంలోని సాహిత్య పుస్తకాలను చదువుకుంటూ, ఆపక్కనే ఉన్న శివాలయంలో సేదతీరే వారని, భజనపాటలు పాడుతూ, సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారని ఆయన చిన్ననాటి మిత్రులు తెలిపారు. పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన చంద్రబోస్ 1984-85లో పదో తరగతి పూర్తికావడంలో పాలిటెక్నిక్‌లో చేరారు. కొంత కాలం ప్రైవేటు ఉద్యోగం చేసి.. 1994-95లో తాజ్‌మహల్ సినిమాలో మంచు కొండల్లోని చంద్రమా అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేశారు. నేనున్నాను సినిమాలో మౌనంగానే ఎదగమని, చీకటితో వెలుగే చెప్పెను అనే రెండు పాటలకు నంది అవార్డులు దక్కించుకున్న చంద్రబోస్ ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు.. నాటు పాటకు ఇటీవల గోల్డెన్ గ్లోబల్ అవార్డుతో పాటు ప్రపంచ ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును దక్కించుకున్నారు. ఇప్పటివరకు మూడు వేలకు పైగా సినిమా పాటలు రాసిన చంద్రబోస్ తండ్రి నర్సయ్య రిటైర్డు టీచర్ కాగా తల్లి మధునమ్మ మూడేళ్ల క్రితం కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం చంద్రబోస్ స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్' గ్రంథాలయాన్ని నిర్మించారు.

అందరి సహకారంతోనే నిర్మించగలిగా : చంద్రబోస్, సినీగేయ రచయిత

'ఆర్ఆర్ఆర్ సినిమాలో నేను రాసిన నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన సమయంలో నా గ్రామంలోని బాల్య మిత్రులు, గ్రామస్థులు అభినందన సభ ఏర్పాటు చేయగా.. నాకు ఎంతో విజ్ఞానాన్ని అందించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడాన్ని చూసి ఎంతో బాధపడ్డా.. అమ్మ జ్ఞాపకార్థం నూతన భవనం నిర్మించాలని నిర్ణయించుకున్నా. స్నేహితులు, గ్రామస్థుల సహకారంతో.. మా నాన్న నరసయ్య, అన్నయ్య రాజేందర్ తోడ్పాటుతో అనుకున్న సమయానికి ముందుగానే నిర్మాణం పూర్తయింది' అని చంద్రబోస్ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ఈ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలకు తోడుగా అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, చల్లగరిగ గ్రామస్థులే కాకుండా మండల ప్రజలు ఈ ఆస్కార్ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇక గురువారం జరిగే ప్రారంభోత్సవానికి పలురంగాల ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు. ఇప్పటివరకు స్థానిక గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ మాత్రమే ఉండేవారని, రేపటి నుంచి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని ఆమె వెల్లడించారు.




ప్రారంభానికి సిద్ధమైన ఆస్కార్ గ్రంథాలయం, సినీ గేయ రచయిత చంద్రబోస్

వార్డు ఆఫీసర్లను మాలో చేర్చడం అన్యాయం

ఆర్‌డీఎంఏకు వినతి పత్రం సమర్పించిన బల్దియా ఉద్యోగులు



ఆర్‌డీఏఎం షాహిద్‌మసూద్‌ను కలిసిన బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూలై 3: ఇటీవల వీఆర్ఏలు, వీఆర్ఏలుగా పని చేసిన వారిని మునిసిపల్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలలో నింపిన విషయం తెలిసిందే. కాగా, వీరి గత రెవెన్యూ విభాగం సీనియారిటీని లెక్కలోకి తీసుకోకుండా తమ ప్రస్తుత మునిసిపాలిటీ రూల్స్‌లో కలిసి సీనియారిటీ లిస్టులో కలపడం వల్ల తమకు చాలా అన్యాయం జరుగుతుందని వరంగల్ బల్దియా కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు. దీనిపై బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలోని వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొత్తగా వచ్చిన వార్డు ఆఫీసర్లను తమతో చేర్చడం వల్ల తమ సీనియారిటీ వెనక్కి తగ్గిపోయి ఆలస్యంగా పదోన్నతి పొందే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాకుండా బల్దియాలో డిగ్రీలు, పీజీలు చేసిన వ్యక్తులు జూనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్ స్టాఫ్‌గా పని చేస్తుండగా ఎస్ఎస్‌సీ చదివి వీఆర్ఏలు, వీఆర్‌వోలుగా వచ్చి చేరిన వారిని తమతో చేర్చయడం అన్యాయం అని వినతిలో పేర్కొన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు స్పందించాలని, దీనిపై రాష్ట్ర అధికారులను కలిసి విన్నవిస్తామన్నారు. అంతేకాకుండా కోర్టును ఆశ్రయించి సమస్య పరిష్కారానికి ముందుకు వెళతామన్నారు. ఆర్‌డీఎంఏను కలిసిన వారిలో జాక్ నాయకులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్‌లతో పాటు సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాలసముద్రం, జూలై 3: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన సత్తు శ్రీధర్ (40) క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం తన భార్య ఇంటి ఎదుట పని చేసుకుంటుండగా ఇంట్లో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శ్రీధర్ భార్య రాధిక, తండ్రి వీరస్వామి ఆటోలో ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. మృతుడు శ్రీధర్‌కు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సీపీ అంబర్ కిషోర్ ఝానును కలిసిన ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, రామకృష్ణ

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం, జూలై 3: కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్‌లలో బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు.. బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ సువర్ణ, పరకాల, గీసుగొండ, ఆత్మకూరు క్రాంతికుమార్, బాబులాల్, సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సీఐలను కమిషనర్ అభినందించారు.

బాలల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

బాలల సంరక్షణకు సామాజిక బాధ్యతగా గుర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ 10వ విడత పోస్టర్స్‌ను సీపీ బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బాల కార్మికులతో పాటు వేధింపులకు గురవుతున్న బాలలను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవికుమార్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల బాలల సంరక్షణ సమితి ఛైర్‌పర్సన్స్ దామోదర్, వసుధ, ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారులు ప్రవీణ్, రాజు, రవికాంత్, ఛైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్స్, ఎన్జీవో ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 17 వరకు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్ర

గిర్మాజిపేట, జూలై 3: భారత రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ భారత్ గౌరవ్ పర్యాటక రైలు ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ జోనల్ గ్రూపు జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య, కాశీ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా గయాలోని విష్ణుపాదం దేవాలయం, వారణాసిలోని కాశీ విశాలాక్షి, విశ్వనాథ, అన్నపూర్ణ దేవాలయాలు, గంగా హారతి, సారనాథ్ కట్టడాల సందర్శన, అయోధ్య రామ్ జన్మభూమి, హనుమాన్ గర్హి, సరయూ నది హారతి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం, మనుమాన్ మందిర్, శంకర్ విమాన మండపం సందర్శన ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్ర 8 రాత్రులు, 9 పగళ్లుగా కొనసాగుతుందని, రోజూ ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజనంతో పాటు పుణ్యయాత్ర ప్రయాణికులకు జీవిత బీమా సదుపాయం, స్నేహపూరిత, వృత్తిపర గైడ్‌ల సేవలు ఉంటాయని, ఐఆర్‌సీటీసీ మేనేజర్ ఈ రైలులో ఉంటారని అన్నారు. ఈ పుణ్యయాత్ర చార్జీలు ఒక్కొక్కరికి స్లీపర్ రూ. 15,510, మూడవ ఏసీ తరగతి రూ.24,300, రెండవ తరగతి ఏసీ రూ. 31,500 ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 5 నుంచి 11 యేళ్లలోపు పిల్లలు ఒక్కొక్కరికి స్లీపర్‌కు రూ.14,140, 3వ తరగతి ఏసీ రూ.23,110, 2వ తరగతి ఏసీ రూ.30,080 ఉంటుందని ఆయా తరగతిల వారీగా నివాస సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ పుణ్యయాత్రకు వెళ్లు ప్రయాణికులు టికెట్ బుకింగ్, పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ ఫోన్ నంబర్లు 9701360701, 9281495845, 9281495843, 8287932228, 8287932229 లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ అధికారి రాజ్‌కుమార్ కోరారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

కేయూ క్యాంపస్, జూలై 3: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు 11మంది విద్యార్థులను పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరూ. ఏబీవీ డిగ్రీ కళాశాల జనగామ 6గురు, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఒలింపియాడ్‌లో అనికేత్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అనికేత్

కాజీపేట, జూలై 3: ఇటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో ఫాతిమాగనర్ బిషప్ బెరెట్టా స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న అనికేత్‌కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ మేరకు పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు జయప్రతాప్‌రెడ్డి బుధవారం పాఠ శాలలో జరిగిన కార్యక్రమంలో అనికేత్‌కు గోల్డ్‌మె డల్, సర్టిఫికెట్ అందజేశారు. సిల్వర్ జోన్ ఒలం పియాడ్ ఆధ్వర్యంలో 2023 - 24 సంవత్సరానికిగాను నిర్వహించిన పరీక్షలో అనికేత్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి (21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవివైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే...

'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..



దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 3: కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి 14,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా బుధవారం అంతే ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలోకి గేట్లన్నీ తెరిచే ఉంచిన అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు.

అన్నారంలో పరీక్షలు

మహదేవపూర్, జూలై 3: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ (అన్నారం) బ్యారేజీలో పూణెకు చెందిన నిపుణుల బృందం ప్యారర్ సెర్చింగ్ మెథడ్‌లో చేపట్టిన పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి ఇవి 13వ రోజులకు చేరాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు పది చోట్లలో మాత్రమే పూర్తయ్యాయని సమాచారం. వర్షాల కారణంగా పరీక్షలకు ఆటంకం కలుగుతోందని తెలుస్తోంది.

క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ విశేష కృషి

ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ ఖాన్

సందడిగా ప్రారంభమైన ప్రాంతీయ క్రీడా వసతి గృహ ప్రవేశ ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 3: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువతలో అంతర్లీనంగా దాగిఉన్న క్రీడా ప్రతిభను గుర్తిస్తూ, వారిని క్రీడా రంగంలో ప్రోత్సహించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) విశేషంగా కృషి చేస్తోందని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. సాట్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో అర్హత సాధించిన క్రీడాకారులు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదులు పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో మౌలిక వసతి, పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ అందిస్తామన్నారు. క్రీడారంగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు కీర్తిప్రతిష్ఠలు తీసువచ్చిన ఘనత మన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉందని, ఈతరం క్రీడాకారులు అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని హితవు పలికారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు.

డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్‌లో తొలి రోజు వివిధ క్రీడాంశాలలో బ్యాటరీ పద్ధతిన నిర్వహించిన ఎంపికలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడా వసతి గృహంలో నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రణాళికబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని అథ్లెటిక్స్ క్రీడా వసతి గృహంలో ప్రవేశాల కోసం జేఎన్‌ఎస్‌లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడా వసతి గృహ ప్రవేశాల ఎంపికలు రెండు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలి రోజు వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, అదే విధంగా గురువారం నిర్వహించనున్న ఎంపిక పోటీలలో ఔత్సాహికులైన విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు.

ఈ కార్యక్రమంలో సాట్ కోచ్‌లు ఎం.డి.గౌస్, ఎస్.స్వర్ణలత, ఎం.రవికుమార్, కె.నర్సింగ్‌రావు, రాజేష్, సుధాకర్, సంతోష్‌చారి, ఆయుష్‌యాదవ్, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, విష్ణువర్ధన్, రాయబారపు నవీన్, కె.రాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కడవెండి తిరుగుబాటుకు 78ఏళ్లు

దొర గడీలను గడగడలాడించిన యోధుడు దొడ్డి కొమురయ్య ● నేడు కొమురయ్య 78వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 : భూమికోసం.. భుక్తికోసం.. బానిస బంధనాల విముక్తి కోసం.. వెట్టిచాకిరీ నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్‌దొరా అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. నాడు రజాకార్ల చర్యలను ఎదురొడ్డి పోరాడారు. నాడు దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గూండాలు కాల్చి చంపి గురువారానికి 78ఏళ్లు నిండాయి. ఈ కొమురయ్య స్వగ్రామమైన కడవెండిలో వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈక్రమంలో తెలంగాణ ప్రాంత తొలి అమరుడు దొడ్డి కొమురయ్య చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 1928వ సంవత్సరంలో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు జన్మించిన కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. ఈ సమయంలో పాలకుర్తి మండలం విస్నూర్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని 60 గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అన్నిరకాలుగా పీడించేవారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడేవారు. 1943వ సంవత్సరంలో జరిగిన ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండి గ్రామానికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రాంక్రిష్టారెడ్డి, పైండ్లయాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో ఆనాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండి గ్రామంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామ ప్రజలు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి గ్రామ ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ఎదుట నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లోనుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డికొమురయ్య, దొడ్డి మల్లయ్యకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితినుంచి బయట పడ్డాడు. దొడ్డికొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగశాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. దొడ్డికొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

దొడ్డి కొమురయ్య వర్ధంతిని విజయవంతం చేయండి

సీపీఎం, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కడవెండిలో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సింగారపు రమేష్, సీపీఐ(ఎం-ఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గడ్డం సదానందం, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం

దొడ్డికొమురయ్య (ఊహా చిత్రం)

కేసముద్రం మీదుగా వేములవాడ, భద్రాచలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

మహబూబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్

కేసముద్రం మీదుగా వేములవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 3: మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి కేసముద్రం మీదుగా వేములవాడకు, హనుమకొండ నుంచి కేసముద్రం మీదుగా భద్రాచలం పుణ్యక్షేత్రాలకు రెండు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు స్థానిక డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను చేతుల మీదుగా ఈ సర్వీసులను ప్రారంభించినట్లు వివరించారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు స్థానిక డిపో నుంచి ఉదయం 6.15 గంటలకు బయలుదేరి కేసముద్రంకు చేరుకుని అక్కడి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి నెక్కొండ, వరంగల్, కరీంనగర్ మీదుగా ఉదయం 11.30 గంటలకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మానుకోటకు బస్సు బయలుదేరుతుందని వరంగల్, నెక్కొండ, కేసముద్రం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు మానుకోటకు చేరుకుంటుందన్నారు. మహబూబాబాద్ నుంచి వేములవాడకు టిక్కెట్ ధర రూ.250, కేసముద్రం నుంచి రూ.230, నెక్కొండ నుంచి రూ.200 టిక్కెట్ ధర ఉంటుందన్నారు.

హనుమకొండ నుంచి భద్రాచలం సర్వీస్ ఇలా..

హనుమకొండ నుంచి భద్రాచలం వెళ్లే బస్సు అక్కడ నుంచి ఉదయం 8.15 గంటలకు బయలు దేరి, నెక్కొండ మీదుగా కేసముద్రంకు 9.40 గంటలకు చేరుకుంటుందని ఆర్టీసీ డీఎం శివప్రసాద్ తెలిపారు. కేసముద్రం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రం మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు భద్రాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి భద్రాచలం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. హనుమకొండ నుంచి భద్రాచలానికి టిక్కెట్ ధర రూ.270, నెక్కొండ నుంచి రూ.220, కేసముద్రం నుంచి భద్రాచలానికి రూ.190 టిక్కెట్ ధర ఉంటుందని వివరించారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఆందోళన వద్దు

అధికారిక వెబ్‌సైట్‌లోని ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లించొచ్చు

బిల్లుల చెల్లింపు బీబీపీఎస్‌లోకి కొనసాగుతున్న 'ఆన్‌బోర్డింగ్'

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 3: విద్యుత్ చెల్లింపులపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రకటించినప్పటి నుంచి వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. కొంతమంది ఆన్‌లైన్ చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌లను ఆశ్రయిస్తుంటే 'టెక్నికల్ ఇష్యూ' అని వచ్చి బిల్లు చెల్లింపు జరగడం లేదు. ఈ విషయాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి దృష్టికి బుధవారం తీసుకెళ్లగా ఆయన స్పందించారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బీబీపీఎస్)లో బిల్లులు చెల్లించేందుకు ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, అతి త్వరలోనే క్రమబద్ధీకరించబడుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్‌లోని గూగుల్ పే, ఫోన్‌పే పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌ను ఎంచుకొని చెల్లింపులు చేయొచ్చన్నారు. లేదా టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారానైనా బిల్లు చెల్లించవచ్చన్నారు. క్రమబద్ధీకరణ తర్వాత పూర్తి వివరాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

సబ్‌స్టేషన్లను రక్షణ బృందాలు తనిఖీ చేయాలి

ప్రతీ సబ్‌స్టేషన్‌ను విధిగా రక్షణ బృందాలు తనిఖీ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల నోడల్ ఆఫీసర్లు, టెక్నికల్, ఎంఆర్‌టీ డీఈలతో బుధవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్లతో పాటు ఎల్‌టీ, హెచ్‌టీ, సిటీ సర్వీసులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతీ సర్కిల్‌లో ఒక మోడల్ ఎస్‌పీఎం షెడ్డును తీర్చిదిద్దాలన్నారు. హనుమకొండ ములుగురోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా ఒక ఆధునాతమైన ఎస్‌పీఎం షెడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రతీ సిబ్బందితో పెప్ టాక్ నిర్వహించాలన్నారు. రైతులకు, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదులకు 18004250028 టోల్‌ఫ్రీ నెంబర్ లేదా 1912 సంప్రదించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

ప్రజా సేవ కొనసాగించాలి : ఎమ్మెల్యే పల్లా


బచ్చన్నపేట ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సన్మానించిన అనంతరం ఎంపీటీసీలతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


నర్మెట ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


లింగాలగణపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

బచ్చన్నపేట, జూలై 3: ఐదేళ్ల పాటు చేసిన పదవికి వీడ్కోలు పలకగానే, బాధ్యతలు నెరవేరినట్టు కాదని, ప్రజాసేవలో కొనసాగేందుకు అవకాశాలు కల్పించుకుని ముందుకు సాగాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్ర ంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నాగజ్యోతి కృష్ణంరాజు, వివిధ గ్రామాల ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం, సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ అంజయ్య, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, కృష్ణంరాజు, ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఏసీఎస్ చైర్మెన్ పులిగిళ్ల పూర్ణచందర్, విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులు వెళ్లిపోండి.. కడియం

స్టేషన్‌ఘన్‌పూర్ : నియోజకవర్గంలోని అధికారులు, అన్నదమ్ములా, అక్క చెల్లెలుగా తనతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన సభకు కడియం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. అనంతరం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కడియం అందించారు. 102 మంది లబ్ధిదారులకు రూ 1,02,11,832 విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ-గట్టయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో సుధీర్‌కుమార్, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, సింగపురం దయాకర్, మునిగెలరాజు, ఇనుగాల రజిత-రాజిరెడ్డి, బూర్ల లత-శంకర్ పాల్గొన్నారు.

● నర్మెట : ప్రజా సేవకు విరమణ ఉండదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసినందున బుధవారం ఎంపీడీవో ఆవరణలోని మండల సమాఖ్య కార్యాలయంలో పదవి విరమణ ఆత్మీయ సన్మాన సభను ఎంపీపీ తేజావత్ గోవర్దన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎంపీపీ, ఎంపీటీసీలను, జడ్పీటీసీని ఘనంగా శాలువలు, జ్ఞాపికలు, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరవింద్ చౌదరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ గౌస్, ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : ఐదేళ్ల పదవీకాలంలో అనేక ఆటుపోట్లు.. కరోనా కష్టాలు.. నిధుల కొరత వెరసి నిర్విరామంగా శ్రమించినా కూడా లక్ష్యాలను చేరుకోలేకపోయామని అయినప్పటికీ లక్ష్య సాధన కోసం మళ్లీ ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజాసేవలో పరితపిస్తామని లింగాలఘణపురం ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి భావోద్వేగంతో ప్రతినభూనారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీటీసీల వీడ్కోలు సభకు ఎంపీడీవో జలంధర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఎంపీపీతో పాటుగా ఎంపీటీసీలు తమ అనుభవాలను పంచుకున్నారు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కేఆర్ లత, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, తహసిల్దార్ వినయ లత మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలలోకి వచ్చానని తన జీవితం ప్రజలకే అంకితమని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవి కాలం పూర్తయి న సందర్భంగా బుధవారం ఎంపీడివో కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల మరణించిన బండ లక్ష్మి చిత్రపటానికి నివాలర్పించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు.

● కొడకండ్ల : మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీల కు 5 ఏళ్ల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతి, వైస్ ఎంపీపీ వీరసోములు, ఎంపీటీసీలు కుందూరు విజయలక్ష్మి, అందె యాకయ్య, వీరారెడ్డి లక్ష్మి, రాంకోటి, చెంచు మణెమ్మ, దొపాటి లక్ష్మి, కుస్నోత్ యాదమ్మ, కోఆప్షన్ మెంబర్ నసీర్‌లకు ముఖ్యఅతిథి డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి శాలువా కప్పి, మెమొంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇందిర, పీఆర్ ఏఈ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, సంఘవి పాల్గొన్నారు.

● దేవరుప్పుల : మండలంలోని పలు శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, మాజీసర్పంచులు బుధవారం కామారెడ్డిగూడెం అక్షర గార్డెన్‌లో ఎంపీపీ, ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. దేవరుప్పుల ఎంపీడీఓ లక్ష్మీనా రాయణ అధ్యక్షతన జడ్పీటీసీ పల్లా భార్గవి సుందర్ రామ్‌రెడ్డి, ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు మహ్మద్ జాకీర్‌హుస్సేన్, లావుడ్యా ఉపేందర్, తోటకూ రి రేణుక, బానోతు యాకూబ్, దావెర రమ, దుబ్బాక కవిత, గుగులోతు ఆశాజ్యోతి, గొడుగు సుజాత, పానుగంటి గిరి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ మజర్‌లను శాలువాలు, పూలమాలలతో, మెమొంటోలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉమామహేశ్వర్‌రావు, మల్లీశ్వర్, అధికారులు పాల్గొన్నారు.


జనగామ ఎంపీపీ, ఎంపీటీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే


దేవరుప్పుల జడ్పీటీసీ భార్గవి, ఎంపీపీ బస్వ సావిత్రి, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు,నాయకులు


కొడకండ్లలో ఎంపీపీని సన్మానిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే


వారంతపు సంతలో కురగాయలు విక్రయించే షెడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జూలై 3 : అభివృద్ధి, సంక్షమం ప్రభుత్వానికి రెండు కళ్లని పాల కుర్తి ఎమ్మెల్యే యశస్వి నిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చెరువు వద్ద నిర్వహించే వారంతపు సంతలో రూ. 16 లక్షలతో నిర్మించిన కూరగాయలు విక్రయించే షెడ్లను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సందర్శించి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. రైతు భరోసా అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందని అన్నారు. సంతలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. నియోజకరవ్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరి చేసి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మదార్, ఎంపీటీసీలు పురుషోత్తం, కమ్మగాని పుష్పలీల, నాయకులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కమ్మగాని నాగయ్య, భాస్కర్, భార్గవ్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

నర్మెట, జూలై 3 : ఖాళీ ప్రదేశం ఉన్నచోట ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. మండల ప్రత్యేక అధికారి దామోదర్‌రావు, ఎంపీడీవో అరవింద్, ఎంపీపీ గోవర్దన్, జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, జడ్పీ కోప్షన్ ఎమ్డీ గౌస్, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన మహిళల అరెస్టు

పాలకుర్తి, జూలై 3 : బంగారం దుకాణాలకు వెళ్లడం .. అక్కడ కొనుక్కుంటున్నట్లు నటించి .. దుకాణదారుల దృష్టి మరల్చి నగల చోరీకి పాల్పడుతున్నట్లు చేసిన ముఠా గుట్టురట్టు చేశారు. పాలకుర్తి పోలీసులు ఘటన వివరాలను బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయిప్రసన్నకుమార్‌లు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిమడుగు, ఫకీర్ తండాలకు చెందిన భూక్యా బుజ్జి, భూక్యా కైలా, గుగులోతు మీరా, భూక్యా అమ్ము ఈజీగా మనీ సంపాదించడం కోసం చోరీలకు అలవాటు పడ్డారు. ఈ నెల 1న మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని రజనీకర్ బంగారం దుకాణంతో పాటు షాబూజీబంగారు దుకాణంలో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చామని నమ్మిస్తూ దుకాణంలోకి మహిళా ముఠా సభ్యులు ప్రవేశించారు. దుకాణదారులు వారికి కావల్సిన నగలను చూపుతుండగా వారిని మాటల్లో పెట్టి దృష్టిని మరల్చి నగలను తస్కరించారు. దుకాణాదారుల కంటికి చిక్కకుండా చోరీకి పాల్పడ్డారు. అపరిచిత వ్యక్తులు నగలు దొంగిలించారని గుర్తించిన దుకాణాదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు దుకాణాల్లో రెండు జతల వెండి కాళ్ల పట్టీలు, నాలుగు చేతి బ్రాస్‌లెట్‌లు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. చోరీకి పాల్పడిన మహిళా ముఠాను పట్టుకోవడంతో జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ అభినందించారు. సమావేశంలో కొడకండ్ల, దేవరుప్పుల ఎస్సైలు శ్రావన్‌కుమార్, చెన్నకేవశవులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

జనగామ రూరల్, జూలై 3: గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశాలు నిర్వహించమని జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత 5 రోజులు క్రితం ఎల్లంల ఎంపీటీసీ బండ లక్ష్మి మరణించడంతో ఎంపీటీసీలు, అధికారులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించి సమావేశం ప్రారంభించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధీలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలను సభ్యులకు వివరించారు. పెంబర్తి ఎంపీటీసి మూల రవి మాట్లాడుతూ పెంబర్తి కంబాలకుంట నుంచి దుర్గమ్మ గుడి వరకు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని తెలిపారు. రైతుల వ్యవసాయ బావుల వద్ద మెయిన్ కరెంట్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని వాటిని సరి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఓబుల్ కేశవపురం గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఓబుల్ కేశవాపూర్ ఎంపీటీసీ కోమ్ము సుజాత మండిపడ్డారు. సమావేశంలో జెడ్పీటీసీ నిమ్మతి దీపికా, ఎంపీడివో సంపత్ కుమార్, ఎంపీటీసీలు మూల రవి, కోమ్ము సుజాత, బానోత్ స్వరూప, కొమ్మురాజుల శాలమ్మ, సలేంద్రీ మహేశ్వరి, కో ఆప్షన్ మెంబర్ బోట్ల అమృతరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండల సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గడ్, జూలై 3 : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన బీజేవైఎం రాష్ట్ర నాయకులు కొలనుపాక శరత్‌కుమార్‌తో కలిసి జనగామలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయన్నారు. మండలంలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లను మరమ్మతు చేసి.. గ్రామాలకు బస్సు సర్వీసులను నడిపించాలన్నారు. అలాగే పీఎం విశ్వకర్మ పథకం లబ్దిదారుల ఎంపిక ప్రకియ పూర్తి చేసేలా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కొనసాగు తున్న జఫర్‌గడ్‌కు చెందిన బరోడా బ్యాంకును.. తిరిగి జఫర్‌గడ్‌లో ఏర్పాటు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. చారిత్రక జఫర్‌గడ్ ఖిలాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, దేవుని కొండపైకి భక్తులు సులభంగా చేరుకునేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జనగామ రూరల్, జూన్ 3: జనగామ మండలంలోని ఎల్లంల ఎంపీటీసీ బండ లక్ష్మి, జనగామ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఉల్లెంగుల కృష్ణ మరణించడంతో విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం వారి కుటుంబ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణ మృతి బాధాకరమని తెలిపారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, కౌన్సిలర్ తాళ్ల సురేష్ రెడ్డి, నాయకులు ఉడుగుల నర్సింహులు, ఉల్లెంగుల సందీప్, భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, దేవునూరి సతీష్ తదితరులు ఉన్నారు.

వారం రోజుల్లో ఇళ్లు కేటాయిస్తాం

నచ్చ చెప్పి పేదలను ఖాళీ చేయించిన అధికారులు

పాలకుర్తి, జూలై 3 : పట్టాలు పంపిణీ చేయకముందే డబుల్‌బెడ్ రూం ఇళ్లను పేదలు బుధవారం ఆక్రమించడంతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయిప్రసన్నకుమార్, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డిలు చేరుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఖాళీ చేయించారు. ఈసంఘటన మండలంలోని గూడూరులో జరిగింది.. గూడూరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 70 డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. గ్రామానికి చెందిన నిలువ నీడ లేని పేదలు ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెట్ రూం ఇళ్లలో సుమారు 40 కుటుంబాలకు చెందిన నిరుపేదలు తలుపులు తీసుకొని అందులో నివాసం ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఎనిమిదేళ్ల వుతున్నా గత కొన్నేళ్లుగా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నామని అధికారులతో ఆవేదన వ్యక్తం చేశారు. మీరు ఇళ్లను ఖాళీ చేస్తే స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, జిల్లా కలెక్టర్‌లతో మాట్లాడి వారం రోజుల్లో గ్రామ సభ నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడుతామన్నారు. ఇలా ఆక్రమించడం సరైంది కాదని తెలిపారు. మీ అందరికి న్యాయం చేస్తామని నచ్చచెప్పడంతో ఖాళీ చేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతుల అభిప్రాయాలే ప్రాధాన్యం

పాలకుర్తి, జూలై 3 : రైతుల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం రైతు భరోసా అమలుకు ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా వ్యవసాయా ధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పాలకుర్తి ఎస్ఎస్‌సీఎస్, తొర్రూరు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో పాలకుర్తి, ఈరవెన్ను గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టగా ముఖ్యఅతిథిగా వినోద్‌కుమార్ హాజరై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యధిక శాతం మంది రైతులు ఐదు ఎకరాలకే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. అదే విధంగా గుట్టలకు, రియలేస్టేట్ భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని చెప్పారు. కొంత మంది రైతులు ఐది ఎకరాల వరకే పరిమితం చేయాలని సూచించినట్లు తెలిపారు. కొంత మంది రైతులు గుట్టలకు, బోడ్‌లకు ఇవ్వకూడదని, ఐటి చెల్లించిన కూడా పది ఎకరాలకు ఇవ్వొచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఆ సంఘాల చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, మైసులు, సత్యనారాయణరెడ్డి, ఏడీఏ పారశురాం నాయక్, ఎంపీపీ నాగిరెడ్డి, రణధీర్, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రియాంక, ఏఈవోలు వెంకటేశం, శ్రావణి, సంధ్య, రాధిక, కీర్తి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నర్మెట, జూలై 3 : మండలకేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శ్రీ శ్రీరామ చతుష్టయ శ్రీ శివ పంచాయతన దేవాలయ 27వ వార్షికోత్సవ వేడుకలను దేవాలయంలో ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణపతిపూజతో ప్రారంభమైన పూజలు శివుడికి రుద్రాభిషేకం, ఆంజనేయస్వామికి చందనాభిషేకం, సహస్రనామార్చన, మంటపరాధన, పూర్ణాహుతి, దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం పూజలను అర్చకులు బ్రహ్మశ్రీ దేశపతి లలితామతిశర్మ, పార్నాంది సీతారామశర్మ, ప్రయాగ నాగభూషణశర్మ, పార్నాంది సతీష్‌శర్మ, మర్రాముచ్చాల నాగభూషణశర్మలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో, భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జంగిటి అంజయ్య, ఆమెడపు లక్ష్మారెడ్డి, మహేశ్వరం శ్రీనివాస్, మహేశ్వరం మురళి, బిజ్జ సత్యనారాయణ, పాండు రంగం, అంజిరెడ్డి, దన్నారపు మురళి, దేవులపల్లి భాగ్యలక్ష్మి, ఆమెడపు గీత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

చిలుపూర్, జూలై 3 : నష్కల్ సీతారామ చంద్రస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎంపీటీసీ పాశం శిరీష -సురేశ్, చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్‌గౌడ్ అన్నారు. బుధవారం శిధిలావస్థకు చేరిన ఆలయ పైభాగంలో సీసీఫ్లోరింగ్ పనులను ప్రారంభించారు. పలువురు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమ ంలో రంగు సురేశ్, పుల్యాల రాజిరెడ్డి, ఇమ్మడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

బచ్చన్నపేట, జూలై 3! మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన మల్ల వరుణ్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మల్ల శ్రీవాణి, కుమార్ దంపతుల కుమారుడైన వరుణ్ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావటం పట్ల గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి..

చిలుపూర్ : చిలుపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన టి. వైష్ణవి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవిని ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, తాజా మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు దాసి శ్రవన్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతీయేటా బాసర ట్రిపుల్ ఐటీలో చిలుపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట, జూలై 3: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్టు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. నక్కవానిగూడెం- పోచన్నపేట వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గోపాల్‌నగర్‌కు చెందిన జలంధర్ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, కొడవటూరు కమాన్ సమీపంలో ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు పట్టుకున్నట్టు తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేసే వారిపై కఠిన చర్యలుంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూలై 3: జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2 పోస్టులు), పొలిటికల్ సైన్స్ (1), చరిత్ర (1 పోస్టుకు) ఈ నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ లో 55 శాతం మార్కు లు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు దారులకు జూలై 6న ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయని తెలిపారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

జనగామ రూరల్, జూలై 3: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలు, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ క్రైం పై బుధవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో జనగామ ఎస్సైలు సృజన్, శ్వేత విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

టిప్పర్లు పట్టుకున్న మైనింగ్ అధికారులు

బచ్చన్నపేట, జూలై 3: పత్రాలు సరిగా లేకుండా ఓవర్‌లోడ్‌తో వెళుతున్న రెండు టిప్పర్లను జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ అజయ్‌కుమార్ నేతృత్వంలో అధికారులు సీజ్ చేశారు. చంపకహిల్స్ సమీపం నుంచి బచ్చన్నపేటకు కంకర, డస్ట్ కలిగిన రెండు టిప్పర్లు వస్తుండగా పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిబంధనల మేరకే టిప్పర్లు నడపాలని ఈ సందర్భగా సూచించారు.

బాధితుడికి పరామర్శ

జనగామ రూరల్, జూలై 3: జనగామ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రమల్ల సుధాకర్ కారుపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల కారుకు నిప్పు అంటించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జనగామ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి బుధవారం ఎర్రమల్ల సుధాకర్ నివాసంలో ఆయనను పరామర్శించారు. జంగా వెంట నాయకులు వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, చింతకింది మల్లేష్ తదితరులు ఉన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

జనగామ కల్చరల్, జూలై 3: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఈ నెల 4న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని అఖిల పక్షం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, టీజీవీపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, టీజీవీపీ రాష్ట్ర నాయకులు పిట్టల సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో లింగాలఘణపురం మండల అధ్యక్షులు ధీరజ్, జనగామ పట్టణ అధ్యక్షులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బోలేబాబాను కఠినంగా శిక్షించాలి

జనగామ కల్చరల్, జూలై 3: తొక్కిసలాటలో చిన్నారులు, మహిళల మరణానికి కారణమైన బోలే బాబాను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, నాయకులు బాల్నె వెంకటమల్లయ్య, కళ్యాణం లింగం, పా ము కృష్ణమూర్తి, కోయల్కార్ శివ, బండ సౌందర్య, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమికే సాయమందించాలి

లింగాలఘణపురం, జూలై3: గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పంటలకు పెట్టుబడి సాయం కేవలం సాగు చేసిన భూములకు మాత్రమే అందించాలని రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు వెలిబుచ్చారు. బుధవారం లింగాలఘణపురం మండలం సిరిపురం, బండ్లగూడెం రైతువేదికల్లో జరిగిన అత్యవసర సమావేశంలో మండలానికి చెందిన పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి మురళీరమణ, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసగౌడ్, ఏవో వెంకటేశ్వర్లు, మబ్బు మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ బుషిగంపల ఉపేందర్, గంగిడి రాంరెడ్డి పాల్గొన్నారు.


సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నర్మెట, జూలై 2 : ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతీ ఒక్కరు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, ముఖ్యంగా మొబైల్ ద్వారా జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని నర్మెట సీఐ సాయిరమణ అన్నారు. సైబర్ జాగరుకత దివాస్‌లో భాగంగా మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఎస్సై శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డి. సదానందం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

చిలుపూర్, జూలై 3 : బాల కార్మికులతో పనులు చేయించుకుంటే కఠినచర్యలు తప్పవని ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా, వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాలమేరకు మండలంలోని రైస్‌మిల్లులు, ఇటుకబట్టీలలో సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చదువుకునే వయస్సులో ఉన్న బాలలను బడిలో చేర్పించాలని, వారితో పనులు చేయిస్తే చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఇంద్రాచారి, వీరన్న, కుమారస్వామి, సునిల్ పాల్గొన్నారు.

భూమి విషయంలో న్యాయం చేయాలి


కొండాపూర్‌లో భూ ధృవీకరణ పత్రాలతో బాధిత రైతులు

చిలుపూర్, జూలై 3 : పదమూడేళ్ళ క్రితం కొనుగోలు చేసిన భూమికి పట్టా చేయకుండా సదరు యాజమాని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేసి తమను ఆదుకోవాలని మండలంలోని కొండాపూర్‌కు చెందిన రైతులు కుంచం కార్యవర్థి రాజు, శివరాత్రి చిన్న రాజయ్య రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ పరిధిలో ని 180ఎ.4.4 సర్వేనంబర్లో 2011లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రెండెకరాల భూమిని కొనుగోలు చేశామని, ఇప్పటివరకు ఆట్టి భూమిలో పంటలను సైతం సాగు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన భూమిని తమకు పట్టా చేయకుండా ఇబ్బందులకు గురి చేయడంతో పాటు, ఇట్టి భూమిని 2015లో అతని సమీప బంధువులకు విక్రయించి తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

ఇళ్ల స్థలాల కోసం భారీగా దరఖాస్తులు

బచ్చన్నపేట, జూలై 3: ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న పేదలకు తక్షణం పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టి ఇవ్వాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారులోని గోపాల్‌నగర్ వద్దగుడిసెలు వేసుకున్న వారితో పాటు, వివిధ గ్రామాలకు చెందిన పేదలు వందలాదిగా తరలివచ్చి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేశారు. ఈ సందర్భంగా నేతలు సుంచు విజేందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశాలాక్షి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులు తీసుకుంటున్నామని, ఏదైన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా డివిజన్ కేంద్రంలోని పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. డివిజన్ కేంద్రంలోని పల్లగుట్ట క్రాస్‌రోడ్డులో తలకాయల గుట్ట ప్రాంతంలో సర్వే నెంబరు 979లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సర్వే నంబర్‌లో 39.02 ఎకరాల భూమి ఉండగా అందులో ప్రస్తుతం 31.01 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. అదేవిధంగా మండలంలోని శివునిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 46లో గల 8ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉండే భూమిని ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అదేశాల మేరకు భూములను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐలు అర్జున్, రవీందర్, రాజు, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.